
సాక్షి
నంద్యాల
ఆదివారం । 14 । మే । 2023



భక్తిశ్రద్ధలతో గంగజాతర

ఉయ్యాలవాడ: ఆర్.పాంపల్లెలో శనివారం గంగ జాతర నిర్వహించారు. సిద్ధి, బుద్ధి యాగం జరిపారు. గ్రామస్తులు విచిత్ర వేషధారణలతో శమీవృక్షానికి మొక్కులు చెల్లించారు.



సంగమేశ్వరానికి జలకళ

కొత్తపల్లి: కొద్ది రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో సంగమేశ్వరం సప్తనదుల సంగమ ప్రాంతంలోని భీముడి లింగం ప్రాంతం మొత్తం నీటితో నిండిపోయింది.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: కళావేదికపై శనివారం హైదరాబాద్‌కు చెందిన శ్రీనటరాజ కూచిపూడి కళా నిలయం వారిచే ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది.

న్యూస్‌రీల్

ఐఐటీ, నీట్ అకాడమీ ప్రవేశాలకు దరఖాస్తులు

నంద్యాల(సిటీ): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఐఐటీ, నీట్ అకాడమీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కో ఆర్డినేటర్ ఐ.శ్రీదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో ఇంటర్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 13 నుంచి 18వ తేదీ లోగా రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజును https://apgpcet.apcfss.in వెబ్‌సైట్‌లో చెల్లించాలని సూచించారు. కర్నూలు సమీపంలోని దిన్నెదేవరపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఈ నెల 21వ తేదీన పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9959958264ను సంప్రదించాలన్నారు.

ఉడికిస్తున్న ఉష్ణోగ్రతలు

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. సాయంత్రం 6 గంటల వరకు కూడా వడగాలులు వీస్తుండటంతో ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మధ్యాహ్నం 3 గంటల సమయానికి కొతాళం మండలం నదిచాగిలో గరిష్టంగా 42.09 డిగ్రీలు, మంత్రాలయంలో 41.57.. నంద్యాల జిల్లా దొర్నిపాడులో 41.19 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది.

17 నుంచి హెచ్‌ఎంలకు వృత్యంతర శిక్షణ

కర్నూలు సిటీ: ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలుగా పనిచేస్తున్న వారికి నాయకత్వ లక్షణాలపై సమగ్ర శిక్ష, ఏపీ-సీమాట్‌ల ఆధ్వర్యంలో ఎనిమిది రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందు కోసం ఏలూరు జిల్లా అగిరిపల్లిలో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 17 నుంచి 24 వరకు ఇవ్వనున్న శిక్షణకు జిల్లా నుంచి 23 మంది హెచ్‌ఎంలను ఎంపిక చేశారు. వీరు శిక్షణ అనంతరం మాస్టర్ ట్రైనర్లుగా జిల్లా, మండల స్థాయిల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

సివిల్ కోర్టులకు వేసవి సెలవులు

- వెకేషన్ జడ్జీలుగా పీజే సుధ, పి.పాండురంగారెడ్డి

కర్నూలు(లీగల్): జిల్లాలోని సివిల్ కోర్టులకు శనివారం నుంచి జూన్ 1 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. అత్యవసర సివిల్ కేసులను రెండో అదనపు జిల్లా జడ్జి పీజే సుధ ఈనెల 15 నుంచి 28వ తేదీ వరకు విచారిస్తారు. ఆరో అదనపు జిల్లా జడ్జి పి.పాండురంగారెడ్డి మే 30 నుంచి జూన్ 12వ తేదీ వరకు వెకేషన్ జడ్జిగా వ్యవహరించి అత్యవసర కేసులను స్వీకరించి విచారిస్తారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ, ఏసీబీ జడ్జి సునీత, సీబీఐ కోర్టు జడ్జి వెంకటరమణ ఈనెల 30 నుంచి జూన్ 12 వరకు వేసవి సెలవులకు వెళ్తారు. మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.శ్రీనివాసకుమార్, నంద్యాల మూడో అదనపు జిల్లా జడ్జి వాసు, ఫ్యామిలీ కోర్టు జడ్జి జి.ప్రతిభాదేవి, ఏడో అదనపు జిల్లా జడ్జి జి.భూపాల్‌రెడ్డి ఈనెల 15 నుంచి 28వ తేదీ వరకు వేసవి సెలవుల్లో వెళ్తారు.

ఈ-కేవైసీ స్పెషల్ డ్రైవ్‌కు విశేష స్పందన

కర్నూలు(అగ్రికల్చర్): ఈ-కేవైసీ చేయించుకునేందుకు సబ్ ట్రెజరీలకు పింఛన్‌దారులు శనివారం భారీగా తరలివచ్చారు. సెలవు దినం అయినప్పటికీ జిల్లాలోని అన్ని సబ్ ట్రెజరీలు పూర్తి స్థాయిలో పనిచేశాయి. సీఎఫ్‌ఎంఎస్, హెచ్‌ఈఆర్‌బీ పేరోల్‌కు సంబంధించిన సేవలు పొందడానికి, ఆర్థిక భద్రతకు ఈకేవైసీ తప్పనిసరి. సీఎఫ్‌ఎంఎస్ ఐడీలను ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నెంబర్లతో అనుసంధానం చేసుకునేందుకు ఖజానా శాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. సబ్ ట్రెజరీల్లో పెన్షనర్ల ఈ-కేవైసీ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటయ్యాయి. ఈ-కేవైసీ తీరును జిల్లా ఖజానా అధికారి రామచంద్రరావు పర్యవేక్షించారు. ఆదివారం కూడా సబ్ ట్రెజరీలు పనిచేస్తాయని, పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మనకూ కావాలి.. చిరుత!


19వ శతాబ్దం చివరి వరకు నల్లమలలో చిరుతల సంచారం

మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో దక్ష పేరు గల ఆడ చిరుత మరణంతో మరోసారి చిరుతల ప్రాజెక్టు వార్తల్లోకి వచ్చింది. భారత ప్రభుత్వం సెప్టెంబర్ 2022లో నమీబియా నుంచి ఎనిమిది చిరుతలను ప్రత్యేక విమానంలో మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కుకు తీసుకొచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చిరుతలను తరలించారు. కాగా, ఫిబ్రవరిలో సాషా, ఏప్రిల్‌లో ఉదయ్ పేరుతో ఉన్న రెండు చిరుతలు అనారోగ్య కారణాలతో చనిపోయాయి. దీంతో ప్రస్తుతం 17 చిరుతలు కునో నేషనల్ పార్కులో ఉండగా ఒక ఆడచిరుత నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. అన్నీ ఆరోగ్యంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే.. అసలు దేశంలో చిరుతల సంఖ్య పెరగాల్సిన ఆవశ్యకత ఏమిటి? ప్రభుత్వం ఎందుకు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది? ఆంధ్రప్రదేశ్‌లోనూ చిరుతల ఆవాసాలు ఉన్నాయా? ఇక్కడా ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టాల్సిన అవసరం ఉందా అనే అంశాలపై చర్చ సాగుతోంది.

– ఏపీ నెట్‌వర్క్/ఆత్మకూరు రూరల్

- రాజుల వేట వ్యసనం కారణంగా అంతరించిన వైనం
- రోళ్లపాడు అభయారణ్యంలో పెరిగిపోయిన కృష్ణజింకలు
- వీటి కారణంగా పంట పొలాలకు పెనుముప్పు
- జింకలను వేటాడే శక్తి చిరుతలకు మాత్రమే..
- దీంతో చిరుతలను నల్లమలలో తిరిగి ప్రవేశపెట్టాలనే ఆలోచన
- వైఎస్‌ఆర్ స్మృతివనం ప్రాజెక్టులో చేర్చేందుకు ప్రతిపాదనలు
- అప్పటికే ఇతర ప్రాంతాల్లో చిరుతల పునరుత్పత్తి ప్రణాళిక
- అనుమతి నిరాకరించిన సెంట్రల్ వైల్డ్ లైఫ్ బోర్డు

సండే స్పెషల్



ఆసియా, ఆఫ్రికా ఖండాలకే పరిమితమైన చిరుతలు ప్రస్తుతం అంతరించిపోయే దశలో ఉన్నాయి. ఆసియా దేశాల్లో ఇరాక్‌లోని జూలకే పరిమితం కాగా ఆఫ్రికా ఖండంలోని గడ్డి మైదానాల్లో 8వేల వరకు చిరుతలు ఉన్నట్లు తెలుస్తోంది. చిరుత గంటకు 80 నుంచి 128 కి.మీ వేగంతో పరుగెత్తుతూ వన్యప్రాణుల్లో అత్యంత వేగవంతమైన జీవిగా ప్రఖ్యాతి గాంచింది. బక్కపలుచగా ఉంటూ పొడవాటి సన్నని కాళ్ళు, పొడవాటి తోక కలిగి వేగంగా పరుగెత్తేందుకు అవసరమైన శారీరక నిర్మాణం కలిగి ఉంది. చిన్న తల, చిన్న ముక్కు, కంటి వద్ద కన్నీటి చారికలా ఉన్న ఒక నల్లటి గీత చిరుతకు ప్రత్యేక గుర్తింపు ఇస్తుంది. ఏడాది పొడవునా సంతానోత్పత్తి చేయడం వీటి ప్రత్యేకత. మూడు నెలల గర్భంతోనే ప్రసవించే ఈ జీవులు కాన్పుకు మూడు నుంచి నాలుగు పిల్లలను కంటాయి.

చిరుత–చిరుత పులి వేరు

ప్రస్తుతం దేశంలోని అడవుల్లో, మైదాన ప్రాంతాల్లో విస్తారంగా కనిపించే చిరుత పులుల(లెపర్డ్)ను, చిరుత(చీతా)లను ఒకటే అని కొందరు భావిస్తుంటారు. అయితే, చిరుతకు, చిరుతపులికి ఆకారం, పరిమాణం, వేగం తదితర అంశాల్లో ఎంతో వ్యత్యాసం ఉంటుంది. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ చిరుత పులి మనగలుగుతుంది. ఒకప్పుడు మన దేశంలో పెద్ద సంఖ్యలో ఉన్న చిరుతలు రాజుల వేట వ్యసనం కారణంగా అంతరించి పోయాయి. ది జర్నల్ ఆఫ్ బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ నివేదిక ప్రకారం 1947 లో మధ్యప్రదేశ్‌లో మహారాజా రామానుజ్ ప్రతాప్ సింగ్ డియో చివరి మూడు చిరుతలను కాల్చి చంపారు. ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవిలో కొల్హాపూర్ మహారాజా చిట్టచివరి చిరుతను వేటాడినట్లు తెలుస్తోంది.

వైఎస్‌ఆర్ స్మృతివనం ప్రాజెక్టులో..

వైఎస్‌ఆర్ స్మృతివనం ప్రాజెక్టు ప్రణాళికలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దివ్య స్మృతిగా ఒక ఉద్యానం ఏర్పాటు చేయడంతో పాటు వెలుగోడు రేంజ్‌లో సుమారు 1,500 హెక్టార్ల అటవీ ప్రాంతంలో అభివృద్ధి పనులతో పాటు చిరుతలు, నెమళ్ళ పునరుత్పత్తిని చేపట్టాలని ప్రతిపాదించారు. అయితే, అప్పటికే ఇతర ప్రాంతాల్లో చిరుతల పునరుత్పాదక ప్రాజెక్టు ప్రతిపాదనలు నడుస్తున్న కారణంగా స్మృతివనంలో పునరుత్పత్తికి సెంట్రల్ వైల్డ్ లైఫ్ బోర్డు అనుమతి లభించ లేదు.

నల్లమలలో చిరుత ఉనికిపై ఆధారాలు



1890 ప్రాంతంలో ఒక బ్రిటీష్ అధికారి పొందు పరిచిన సమాచారం మేరకు నల్లమల అటవీ ప్రాంతంలో చిరుతలు సంచరించినట్లు తెలుస్తోంది. గడ్డి మైదానాల రారాజుగా పిలుచుకునే చిరుత ఆవాసానికి రోళ్లపాడు అభయారణ్యంతో పాటు గుండ్లబ్రహ్మేశ్వరం, ఎన్‌ఎస్‌టీఆర్ అభయారణ్యాలలోని గడ్డిమైదానాలు, పొదలతో కూడిన చిట్టడవులు అనువుగా ఉంటాయి.

– అలన్ చోంగ్ టెరాన్, డిప్యూటీ డైరెక్టర్, టైగర్ ప్రాజెక్ట్, ఆత్మకూరు

శేషాచలం అడవుల్లోనూ సంచారం



వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా రూపొందించిన రిపోర్టు ప్రకారం చిరుతలు శేషాచలం అడవుల్లో సంచరించినట్లు తెలుస్తోంది. విశాలమైన ప్రాంతాల్లో సంచరించే అలవాటున్న ఈ జంతువులు శేషాచలం నుంచి నల్లమల వరకు కూడా పర్యటించే అవకాశముంది. 1800 ప్రాంతాల్లో అటవీ సమీప గ్రామాల్లోని రైతులు చిరుతలను పెంచుకునే వారని తెలుస్తోంది. వీటిని అడవుల్లో వేట కోసం ఉపయోగించుకునేవారు.

– విజయకుమార్, వన్యప్రాణి సంరక్షణ నిపుణులు



నల్లమల ఒకప్పుడు చిరుతలకు ఆవాసం

నల్లమలలో చిరుత ఉనికి గురించి 1890 ప్రాంతంలో అటవీశాఖ వర్క్ ప్లాన్‌లో అప్పటి బ్రిటీష్ అధికారులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని స్థానిక అటవీ అధికారులు ధృవీకరిస్తున్నారు. నల్లమలను ఆనుకునే ఉండే రోళ్ళపాడు పక్షి అభయారణ్యం భౌగోళిక స్థితిని గమనిస్తే ఇది ఒకప్పుడు చిరుతకు చక్కటి ఆవాస ప్రాంతంగా ఉండేదని అర్థమవుతుంది. ఆత్మకూరు అటవీ డివిజన్ వెలుగోడు వెస్ట్ బీట్‌ను ఆనుకుని ఉన్న గుంతకందాల నుంచి మొదలయ్యే బరకలు(గడ్డి మైదానం) అటు ఓర్వకల్లు వరకు ఇటు కొత్తపల్లి మండలం మిట్టమీద లింగాపురం వరకు సుమారు 50 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ విశాల గడ్డిమైదానంలో కొంతభాగాన్ని రోళ్ళపాడు అభయారణ్యంగా ఏర్పాటు చేశారు. విశాలమైన ఈ గడ్డి మైదానంలో అడ్డూ అదుపు లేకుండా కృష్ణ జింకలు పెరిగిపోతూ సమస్యగా మారుతున్నాయి. అత్యంత వేగంగా పరుగు తీసే కృష్ణ జింకలను అంత సులువుగా ఏ ఇతర మాంసాహార వన్య ప్రాణులు వేటాడలేవు. కృష్ణ జింకను వేటాడగల సామర్థ్యం ఒక్క చిరుతకే ఉంది. తిరిగి నల్లమలకు కూడా చిరుతను తేగలిగితే పలు జీవావరణ సమస్యలు రూపుమాసి పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుంది.

చిన్నారికి రూ.13 లక్షల ఆర్థిక సాయం



సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కును అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి రూ.13 లక్షల ఆర్థిక సాయాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అందించారు. హాలహర్వి మండలం పచ్చరపల్లి గ్రామానికి చెందిన జి.వినోద్ అనే పదేళ్ల బాలుడికి అల్లోజెనిక్ బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి ఉంది. తల్లిదండ్రులు పేదలు కావడంతో విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి.. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.13 లక్షలు మంజూరు చేయించారు. శనివారం ఆలూరులోని తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి బాధితుడికి చెక్కును అందజేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి గుమ్మనూరు జయరాంకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలకు తొలగిన అడ్డంకులు

- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఇళ్ల స్థలాలకు గ్రీన్ సిగ్నల్
- మొదటి దశలో 4,316 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పంపిణీ
- ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



పేదలకు పంపిణీ చేసేందుకు స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణంలోని పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేసేందుకు అడ్డంకులు తొలగాయని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కర్నూలు బైపాస్ రోడ్ పక్కన ఉన్న ఇళ్ల స్థలాలను ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ పట్టణంలో 5 వేల మందికి ఇళ్ల స్థలాలను అందించేందుకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం ప్రజల పక్షాన నిలిచిందన్నారు. పట్టణంలోని అర్హులైన పేదలందరికీ పక్కా ఇంటి కలను త్వరలోనే సాకారం చేయనున్నామన్నారు. లక్షల విలువ చేసే ఆస్తిని పేదలకు కుల మతాలకు అతీతంగా కేటాయించేందుకు డిప్ ద్వారా అత్యంత పారదర్శకంగా పంపిణీ చేయనున్నామన్నారు. పట్టణంలో మొదటి విడతలో 4,316 మందికి ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రూ. లక్షల విలువ చేసే ఆస్తిని పేదలందరికీ అందించే ఘనత వైఎస్సార్సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పేదలకు ప్రభుత్వం మంచి చేయాలని తలపిస్తే టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి అడ్డుకోవడం దారుణమన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించే పిటిషన్‌పై గ్రీన్ సిగ్నల్ రావడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల స్థలాలు పేదలు పొందకుండా అడ్డంకులు సృష్టించిన టీడీపీ నాయకులకు కోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. అభివృద్ధి ఫలాలను అర్హులందరికీ ఇళ్ల వద్దకే వెళ్లి అందిస్తున్నామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని టీడీపీ నాయకులకు త్వరలోనే ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంశావలి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈ జయభారత్‌రెడ్డి, దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారమే లోక్ అదాలత్ లక్ష్యం

- జిల్లా జడ్జి శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం జరిగిన కేసుల్లో అప్పీళ్లకు అవకాశం ఉండబోదన్నారు. కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. శ్రీశైలం ముంపు బాధితులు పది మందికి ప్రభుత్వం చెల్లించాల్సిన నష్టపరిహారపు చెక్కులను జిల్లా జడ్జి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఏడో అదనపు జిల్లా జడ్జి జి.భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి.మల్లీశ్వరి, అదనపు ఎస్పీ ప్రసాద్, విశ్రాంత జిల్లా జడ్జి నరసింహారెడ్డి, లోక్ అదాలత్ కార్యదర్శి సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు, శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కె.మల్లికార్జున, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, బీమా కంపెనీల అధికారులు, మున్సిపల్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

10,113 కేసుల పరిష్కారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 10,113 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు తెలిపారు. కర్నూలులో 44 మోటార్ వాహన ప్రమాద కేసులను ఏడో అదనపు జిల్లా జడ్జి జి.భూపాల్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు బి.మురళి మనోహర్‌లు పరిష్కారం చేసి బాధితులకు నష్టపరిహారాన్ని ఇచ్చే విధంగా ఇన్సూరెన్స్ కంపెనీలను ఒప్పించారు. ఆదోనిలో 83, ఎమ్మిగనూరులో 1,107, ఆలూరులో 140, పత్తికొండలో 1,535, బనగానపల్లెలో 236, ఆళ్లగడ్డలో 296, ఆత్మకూరులో 69, నందికొట్కూరులో 80, కోవెలకుంట్లలో 434, నంద్యాలలో 1,635, కర్నూలులో 3,176 కేసులు పరిష్కారం చేశారు.



శ్రీశైలం ముంపు బాధితులకు పరిహారం చెక్కును అందజేస్తున్న జిల్లా జడ్జి ఎస్.శ్రీనివాసరావు

విద్యాకానుక కిట్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

ఆళ్లగడ్డ: జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ అనురాధ పేర్కొన్నారు. శనివారం జగనన్న విద్యాకానుక కిట్లు భద్రపరిచిన వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల గదులను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2023 - 24 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాకు మంజూరైన యూనిఫామ్‌లు, బెల్టులు, షూస్, నోట్ పుస్తకాలు, బ్యాగులు తదితర సామగ్రిని ఎంపిక చేసిన పాఠశాలల్లో భద్రపరుచుతున్నామన్నారు. జూన్ మొదటి వారానికి పూర్తి స్థాయిలో జగనన్న విద్యాకానుక కిట్లు నేరుగా మండల స్థాయిలో సరఫరా చేసి అక్కడి నుంచి ఆయా పాఠశాలలకు నేరుగా ఎంఈఓ పర్యవేక్షణలో సరఫరా జరుగుతుందన్నారు. కిట్లు పారదర్శకంగా సరఫరా చేసేందుకు మండల స్థాయిలో టీంలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం 10వ తరగతి సప్లిమెంటరీ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ శిబిరాలను తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంఈఓ శోభావివేకవతి, హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి ఉన్నారు.



పీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ అనురాధ

ఆన్‌లైన్ బెట్టింగ్ 'ఆట' కట్టించారు!

- ఆదోనిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్ట్
- రూ.80 లక్షల నగదు స్వాధీనం
- ఒక కారు, రెండు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శివనారాయణస్వామి



బెట్టింగ్ నిర్వాహకుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు

ఆదోని అర్బన్: ఐపీఎల్ సీజన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని ఆదోని త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.80 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక కారు, రెండు బైకులు, నాలుగు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శివనారాయణస్వామి శనివారం వివరాలు వెల్లడించారు. ఆదోని పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతుందన్న సమాచారంతో త్రీటౌన్ సీఐ శ్రీరామ్, ఎస్‌ఐలు, సిబ్బంది శుక్రవారం పింజారివాడి వీధిలో హుసేన్ అలియాస్ చిద్దు ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఆదోని పట్టణం మరాఠీ గేరికి చెందిన మహానంది, పింజారివాడి వీధికి చెందిన ఉసేన్ అలియాస్ చిద్దు, రాజేశ్వరినగర్‌కు చెందిన మహ్మద్, తెలంగాణ రాష్ట్రం అయిజకు చెందిన వడ్ల రాఘవేంద్ర ఆచారిలను అరెస్ట్ చేశారు.

భారీగా డబ్బు సంపాదించాలనే ఆశతో..

భారీగా డబ్బు సంపాదించాలనే ఆశతో వడ్ల రాఘవేంద్ర ఆచారి ఐదేళ్ల నుంచి క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. రూ.వెయ్యికి రూ.300 కమీషన్ ఇచ్చే విధంగా మాట్లాడుకుని వేర్వేరు ప్రాంతాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం ఆదోని ప్రాంతానికి చెందిన మహానందిని పరిచయం చేసుకున్నాడు. అతని ద్వారా రమేష్, మహ్మద్‌ఖాసీం, హుసేన్ అలియాస్ చిద్దు, ఇస్మాయిల్, గొల్ల భీమ, ప్రతాప్, శ్రీనివాసులు, గౌడవలి తదితరులు ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నాడు.

వెబ్‌సైట్ లింకు ద్వారా..

నేషనల్ ఎక్స్ఛేంజ్9 డాట్ కో అనే వెబ్‌సైట్ ద్వారా వీరు క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తారు. సెల్‌ఫోన్లకు లింకు పంపించి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను ఇస్తారు. దీంతో మ్యాచ్ అంతా వారికి లైవ్ కనిపిస్తుంది. అందులో మ్యాచ్‌ను బట్టి బెట్టింగ్ 1:1.5, 1:2 ప్రకారం డిస్‌ప్లే అవుతుంది. బెట్టింగ్‌లో గెలిస్తే అనుకున్న డబ్బు చెల్లిస్తారు. ఓడిపోతే డబ్బును వెంటనే స్వాధీనం చేసుకుంటారు. ఆన్‌లైన్ బెట్టింగ్ పేరుతో యువతను మోసం చేస్తున్న వీరి ఆటను పోలీసులు కట్టించారు.

ఎవరెవరి నుంచి ఎంతెంత స్వాధీనం

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న మహానంది నుంచి రూ.30 లక్షలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక కారు, రెండు మోటార్ సైకిళ్లు, ఒక ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. మహానందిపై ఆదోనిలో మూడు స్టేషన్‌లలో ఎనిమిది క్రికెట్ బెట్టింగ్ కేసులు ఉన్నాయి. హుసేన్ అలియాస్ చిద్దు నుంచి ఒక సెల్‌ఫోన్, రూ.10 లక్షలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈయనపై కోసిగి, పెద్దతుంబళం, ఇస్వి, ఆదోని 1, 3 పోలీస్‌స్టేషన్‌లలో ఆరు కేసులు ఉన్నాయి. మహ్మద్‌ఖాసీం నుంచి రూ.10 లక్షల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈయనపై కోసిగి, ఆదోనిలోని వన్‌టౌన్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లలో నాలుగు కేసులు నమోదయ్యాయి. వడ్ల రాఘవేంద్ర ఆచారి నుంచి రూ.30 లక్షలు నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈయనపై ఈ కేసుతో పాటు తెలంగాణ రాష్ట్రం గద్వాల్ పోలీస్‌స్టేషన్‌లో క్రికెట్ బెట్టింగ్ యాక్ట్ ప్రకారంగా నాలుగు కేసులు ఉన్నాయి.

మరో ఆరుగురు పరారీ

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు నలుగురి నుంచి రూ.కోటి వరకు సొత్తును సీజ్ చేశామని డీఎస్పీ తెలిపారు. ఆరుగురు నిందితులు రమేష్, ఇస్మాయిల్, గొల్ల భీమ, ప్రతాప్, శ్రీనివాసులు, గౌడవలీ పరారీలో ఉన్నారని, వారిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసిన త్రీటౌన్ సీఐ శ్రీరామ్, ఎస్‌ఐలు జయశేఖర్, చిన్నపీరయ్య, పోలీసు సిబ్బంది నరేంద్ర, మధు, సోమేష్, కాశీంవలీ, నరసింహ, మంజుకుమార్, మురళీలను డీఎస్పీ శివనారాయణస్వామి అభినందించారు.

క్లుప్తంగా

ప్రకాశం జిల్లా వాసి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న శ్రీశైలం సీఐ దివాకర్‌రెడ్డి, పోలీసులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలోని ఓ వసతి గదిలో ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి చేరిన ధాకా రామసుబ్బారెడ్డి(57) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం శ్రీశైలం చేరుకున్న ఈయన ఓ వసతి గృహంలో గది అద్దెకు తీసుకున్నారు. శనివారం ఉదయం ఎంతసేపటికి గది నుంచి బయటకు రాకపోవడంతో సిబ్బంది తలుపులు కొట్టినా ఎంతసేపటికీ తీయలేదు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగత జీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రామసుబ్బారెడ్డి వ్యాపారం నిమిత్తం మైసూర్‌లో స్థిరపడ్డాడని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని సీఐ దివాకర్‌రెడ్డి తెలిపారు. కుటుంబీకులకు సమాచారం అందించామన్నారు.

'సాక్షి' ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు



వేదిక : ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాల
తేదీ : 18- 5-23
సమయం : ఉదయం 9 గంటలకు

కర్నూలు టౌన్: సాక్షి ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ కర్నూలు ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో చిత్ర లేఖన పోటీలు నిర్వహిస్తున్నారు. జూనియర్స్ విభాగం (6,7,8 తరగతులు) సీనియర్స్ విభాగం (9,10 తరగతులు)ల్లో ఈ పోటీలు ఉంటాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. చిత్ర లేఖన పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులు తమ వెంట పెన్సిళ్లు, వాటర్ కలర్స్, డ్రాయింగ్ చార్టు ఏ-4 సైజ్ తెచ్చుకోవాల్సి ఉంది. ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. పేర్ల నమోదుకు సాక్షి కార్యాలయం ఫోన్ నంబర్ 08518-255166ను, డ్రాయింగ్ మాస్టర్లు రామక్రిష్ణ-99492-87757, ఖాజా -9441657353 సెల్ నంబర్లను సంప్రదించాలి. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.

సిలిండర్ పేలి రెండు గుడిసెలు దగ్ధం

- రూ. 13 లక్షలకు పైగా ఆస్తి నష్టం
- ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణ నష్టం



పూర్తిగా కాలిపోయిన గుడిసె

మహానంది: ఓ కుటుంబం అమ్మవారి మొక్కు తీర్చుకునేందుకు అంతా సిద్ధం చేసుకుంటోంది. అందుకు కావాల్సిన సామగ్రి అంత సమకూర్చుకుంటోంది. బంధువులను పిలిచుకునే పనిలో కుటుంబీకులు ఉన్నారు. ఇంతలోనే వారు నివసిస్తున్న గుడిసెలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. డబ్బులు, బంగారు ఆభరణాలు, సామగ్రి మొత్తం కాలి బూడిదైంది. ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ ఘటన బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఈర్నపాడు గ్రామానికి చెందిన బండి కాడిశేఖర్ ఆలియాస్ అవుకు శేఖర్ గుడిసెలో నివాసముంటున్నాడు. మరో రెండు రోజుల్లో నందవరం చౌడేశ్వరీ అమ్మవారికి ఉత్సవం చేసేందుకు సిద్ధమవుతున్నాడు. అప్పటికే అవసరమైన సామగ్రి, నగదు సమకూర్చుకున్నాడు. అయితే శనివారం సరుకులు కొనుగోలు చేసేందుకు నంద్యాలకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయి. గుర్తించిన స్థానికులు మంటలను అదుపులోకి తెచ్చేలోపే పక్కనే ఉన్న చంద్రకాశి గుడిసెకు కూడా మంటలు వ్యాపించి రెండు గుడిసెలు దగ్ధమయ్యాయి. శేఖర్ గుడిసెలో ఏడు తులాల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షలు బూడిద య్యాయి. పక్కనే పశువుల కోసం నిల్వ ఉంచుకున్న పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది. నాలుగు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 13 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు శేఖర్, చంద్రకాశి కోరుతున్నారు.

డ్రంక్ డ్రైవ్ కేసులో యువకుడికి జైలు శిక్ష

ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన హుసేనయ్యకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు జడ్జి అబ్దుల్ రహిమాన్ 22 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఈ నెల 1వ తేదీన వాహనాల తనిఖీలో హుసేనయ్య మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడటంతో కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు జడ్జి జైలు శిక్ష విధించారన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

ఉయ్యాలవాడ: మండల కేంద్రం ఉయ్యాలవాడలో శనివారం ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు ఘర్షణ పడ్డారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మామిళ్ల రమణయ్యతో అదే గ్రామానికి చెందిన ఒగురు సుబ్రమణ్యం, పెద్దసుబ్బయ్యలు పాత విషయాలను మనసులో పెట్టుకుని వాగ్వాదపడ్డారు. వారి మధ్య మాటామాట పెరిగి కర్రతో రమణయ్య తలపై దాడి చేశారు. అలాగే సుబ్రమణ్యం కుమారుడు సాకేత్‌ను రమణయ్య రాయితో కొట్టగా కుడి కాలుకు గాయమైంది. పరస్పరం ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కల దాడిలో జింక పిల్ల మృతి

డోన్ టౌన్: వెంకటాపురం గ్రామ సమీపంలోని పంట పొలాల్లో సుమారు నెలన్నర వయస్సు ఉన్న జింక పిల్లపై శనివారం కుక్కలు దాడి చేసి చంపేశాయి. కొద్ది నెలలుగా వెంకటాపురం పరిసర ప్రాంతాల్లో వందల సంఖ్యలో జింకలు సంచరిస్తున్నాయి. గ్రామ పరిసరాల్లో బోరుబావుల కింద పంటలు సాగు చేయడం, చెరువులో సమృద్ధిగా నీరు ఉండటమే ఇందుకు కారణం. వన్యప్రాణులు కుక్కల బారిన పడకుండా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తల్లీబిడ్డ అదృశ్యం



అదృశ్యమైన చిన్నారి మైమూన్,తల్లి హసీనా

నందికొట్కూరు: మల్యాల గ్రామానికి చెందిన మాలిక్ బాషా భార్య హసీనా, కుమార్తె మైమూన్ ఈనెల 27వ తేదీ నుంచి కనిపించడం లేదు. పని మీద నంద్యాలకు వెళ్లి వచ్చేసరికే ఇంట్లో ఇద్దరూ కనిపించలేదని, అప్పటి నుంచి బంధువులు, చుట్టు పక్కల గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించలేదని మాలిక్‌బాషా శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ విజయభాస్కర్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 912 11 01187కు సమాచారం అందించాలని కోరారు.

14 ఓవర్ లోడ్ కేసులు నమోదు

కొలిమిగుండ్ల: ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఆటోలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రం మీదుగా అవుకు మండలంలోని పలు పల్లెలకు మిరప పంట కోత పనులకు కూలీలను తీసుకెళ్తున్న 14 ఆటోలపై కేసు నమోదు చేశామన్నారు. పరిమితికి మించి ప్రయాణించడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఆటో డ్రైవర్లు రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

మేలు చేయాలనే చింత



స్వార్థం పెరిగిపోతుంది. నేను.. నా కుటుంబంతోనే జీవితం ఆగిపోతుంది. ప్రకృతిని నిశితంగా పరిశీలిస్తే మనకు ఎన్నో నేర్పిస్తోంది. పుట్టిన తర్వాత సమాజానికి ఎంతో.. కొంత ఇవ్వాలని చెబుతోంది. ఇందుకు నిదర్శనం చిత్రంలో కనిపించే చింత చెట్టు. చెలిమిల్ల గ్రామంలో లింగాల గ్రామ రస్తాలో గతేడాది ఈదురు గాలులకు చింత చెట్టు కూకటి వేళ్లతో సహా నేలకూలింది. స్థానికులు అలాగే వదిలేయడంతో కొద్ది రోజులకు ఎండిపోయింది. కింద పడినా తనలో చేవ బతికే ఉందంటూ మళ్లీ చిగురించింది. చెట్టు నిండా పూత, చిగురుతో కళకళలాడుతోంది. ప్రాణం ఉన్నంత వరకు ఇతరులకు మేలు చేద్దామంటూ ఆకుపచ్చని సందేశం ఇస్తోంది.

– పాములపాడు